ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
గురువారం 29 మే 2025



అప్రమత్తంగా ఉంటే చాలు..

- మళ్లీ కరోనా కలవరం
- కొత్త వేరియంట్‌తో ముప్పు లేదంటున్న వైద్యులు
- కొవిడ్, సీజనల్ వ్యాధులపై ప్రభుత్వం అలర్ట్
- గతంలో తీసుకున్న వ్యాక్సిన్‌తో పెరిగిన వ్యాధి నిరోధకత





(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కరోనా మరోసారి కలవరపెడుతోంది. పొరుగు రాష్ట్రాల్లో కరోనా కేసులు నమోదు అవుతుండడంతో రాజన్నసిరిసిల్లజిల్లా ప్రజలు హైరానా పడుతున్నారు. దేశంలో కొవిడ్, ఆ తరువాత ఒమ్రైక్రాన్, ఇలా ఏ వేరియంట్ వచ్చినా జిల్లాలో కేసులు నమోదు అవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం వస్త్రోత్పత్తి రంగంలో ఉండగా, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం దక్షిణ కాశీగా విరాజిల్లుతోంది. ఈక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి జిల్లాకు రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. మరోవైపు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్న కార్మికులతో పాటు ఇతర దేశాల్లోనూ ఉద్యోగం, చదువు రీత్యా వెళ్లిన వారు ఎక్కువగానే ఉన్నారు. రాకపోకలతో వైరస్ వ్యాప్తి జిల్లాలో ముందుగానే వెలుగు చూస్తోంది. గతంలో కొవిడ్ తరువాత వచ్చి ఒమ్రైక్రాన్ కూడా రాష్ట్రంలో సిరిసిల్లలోనే తొలి కేసులు గుర్తించారు. ఈ క్రమంలో ప్రపంచాన్ని స్తంభింప జేసిన కరోనా మహమ్మారి మరోసారి బయట పడడంతో జిల్లా ప్రజల్లో అప్రమత్తత మొదలైంది. వైద్యులు, ఐసీఎంఆర్ మాత్రం ప్రస్తుతం వస్తున్న వేరియంట్‌తో పెద్దగా ముప్పులేదని సాధారణ అప్ర మత్తతే సరిపోతుందని సూచిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కొవిడ్‌తో పాటు వర్షాకాలం సీజనల్ వ్యాధులను ఎదుర్కొనే దిశగా అలర్ట్ ప్రకటించింది. తీసుకోవాల్సిన సూచనలపై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు కూడా జారీ చేశారు.

వదంతులు వ్యాప్తి చెందకుండా చర్యలు...

కొవిడ్‌పై వస్తున్న వదంతులు వ్యాప్తిచెందకుండా ప్రభుత్వం చర్యలు కూడా చేపట్టింది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు కరోనాపై మాట్లాడాలని, అధికారులు ఎలాంటి ప్రకటనలు చేయవద్దని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని ప్రభుత్వం సూచనలు చేసినట్లుగా తెలిసింది. సాధారణంగా వచ్చే జలుబు, దగ్గుకు ప్రజలు భయాందోళనలకు గురికావద్దని సూచనలు చేస్తున్నారు. మరోవైపు ఆక్సిజన్‌నిల్వలు, బెడ్స్, అవసరమైన మందులు, మాస్క్‌లు, ఆర్టీపీసీఆర్ పరీక్షల కిట్‌లు, ఇతర సామగ్రి అవసరాలపై ప్రభుత్వం నివేదిక కోరిన ట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం వస్తున్న కొత్త వేరి యంట్‌తో ఇబ్బందులు లేకపోయినా గుండె, క్యాన్సర్, కాలేయం, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు, కిడ్నీ బాధితులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

గతంలో జిల్లాలో 37,197 మంది బాధితులు...

కరోనా మహమ్మారి మొదటి రెండు దశల్లో చేసిన బీభత్సం ప్రజల నుంచి ఇప్పటికి తొలగిపోవడం లేదు. ఎంతో మంది ఆర్థికంగా..

- మిగతా 8లో

జిల్లాలో మూడు సీజన్‌లలో కొవిడ్ బాధితులు, మరణాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం	కొవిడ్ బాధితులు	మరణాలు
తంగళ్లపల్లి	2,497	39
నేరెళ్ల	858	10
చీర్లవంచ	1,031	18
కోనరావుపేట	1,773	39
ఇల్లంతకుంట	2,255	27
గంభీరావుపేట	2,078	30
పోత్గల్	1,851	49
ఎల్లారెడ్డిపేట	4,269	111
వేములవాడ	6,287	132
చందుర్తి	2,024	41
బోయినపల్లి	1,070	29
విలాసాగర్	308	03
కొదురుపాక	447	04
సిరిసిల్ల పీఎస్‌నగర్	4,362	64
సిరిసిల్ల బీవైనగర్	4,519	80
జిల్లా ఆసుపత్రి	1,558	0
మొత్తం	37,197	676



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

రాజన్న ఆలయ 13 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు
- రూ.1.44 కోట్లు, బంగారం 107.5 గ్రాములు
- వెండి 7.9 కిలోలు..

7

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పూర్తి సహకారం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఇళ్ల నిర్మాణం పురోగతిపై సమీక్ష

8



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రైతుల ఇబ్బందులు ఎమ్మెల్యేకు కనిపించడం లేదా?



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ వేణు

ఇల్లంతకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పోసిన రైతులు పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని పోసి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. వర్షానికి ధాన్యం మొలక వస్తోందని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ కనీసం రైతుల వద్దకు రాలేదన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలలో దాదాపు 30వేల బస్తాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలని లేదంటే రైతుల మద్దతుతో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు కూనబోయిన రఘు, సావనపెల్లి అనీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

2న లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేయాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క - 'రాజీవ్ యువ వికాసం'పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్ మే 28 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకం కింద లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటుచేసి జూన్ 2న లబ్ధిదారులకు ఎంపిక పత్రాలను అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాజీవ్ యువ వికాసం అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీసీఎం మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు కార్పొరేషన్ ద్వారా మొక్కుబడిగా పథకాలు అమలు చేశాయని, తమ ప్రభుత్వం లక్షలాది మంది యువతకు స్వయం ఉపాధి కల్పించాలని చిత్తశుద్ధితో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తోందన్నారు. యువ వికాసం పథకం కింద వచ్చే సహాయంతో యువత వ్యాపారంచేసి లబ్ధి పొందాలని, రూ 8 వేల కోట్ల రూపాయలతో దాదాపు 5 లక్షల మంది యువతను వ్యాపారవేత్తలుగా మారుస్తున్నామని, ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పెట్టుబడి ఎలా పనిచేస్తుందో రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని, రాష్ట్ర జడీపీ వృద్ధిలో ఈ పథకం భాగస్వామ్యం కావాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన యూనిట్ల గ్రౌండింగ్ చేసిన తర్వాత వాటి పనితీరు పర్యవేక్షించేందుకు జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మే 29, 30 తేదీలలో జరిగే ఇన్‌చార్జి మంత్రుల సమావేశాలలో రాజీవ్ యువ వికాసంపై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలన్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అందులో యువ వికాసం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేయాలన్నారు. బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, లబ్ధిదారుల ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి బిసి వెల్ఫేర్ అధికారి రాజా మనోహర్ మైనార్టీ వెల్ఫేర్ అధికారి భారతి ఈ డి ఎస్సి కార్పొరేషన్ స్వప్న ఎల్.డి.ఎం. మల్లికార్జున్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సురవరం ప్రతాపరెడ్డి జయంతి

సిరిసిల్ల టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం స్వాతంత్ర్య సమర యోధుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ప్రతాపరెడ్డి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు గుల్లపల్లి నరసింహారెడ్డి, నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, పూర్మాణి లింగారెడ్డి, కుంభాల మల్లారెడ్డి, ఉమ్మారెడ్డి సత్యనారాయణ రెడ్డి, పాతూరి రాజిరెడ్డి, ఎడమల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

చందుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధ్యాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జోగాపూర్ అనుబంధ గ్రామమైన గుడిపేటలో బుధవారం తడిసిన ధాన్యాన్ని రైతులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి వరి కోసి రెండు నెలలు కావస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోలు పూర్తి కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. అమరబండ శ్రీనివాస్, అమరబండ మల్లేశం, వట్టింలా శంకర్, రాకేష్, సమీర్, రాజేశం, పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమ యాజమానులపై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

సిరిసిల్ల రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులను శ్రమదోపిడీకి పాల్పడుతున్న బీడీ పరిశ్రమల యాజమాన్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ బీడీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులు, ప్యాకర్‌లు, నెలసరి ఉద్యోగులకుందరికి కరువు భత్యం, డీఏలు కలుపుకుని వెయ్యి బీడీలకు పది రూపాయల 40పైసలు పెరిగిందన్నారు. ప్రస్తుతం ఉన్న పెరిగిన కూలి కలుపుకుంటే వెయ్యిబీడీలకు మొత్తం రూ.261.40 పైసలు కార్మికులకు ఏప్రిల్ నెలనుంచి బీడీ కంపెనీల యాజమానులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్యాకర్‌కు రోజుకు పదిరూపాయల 40పైసలు పంచడం జరిగిందన్నారు. బీడీ కార్మికుల నుంచి యాజమాన్యం పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతోందన్నారు. కార్మికుల వద్ద నుంచి నెలకు ఎన్ని బీడీలు చేసినా కూడా 2వేల బీడీల వేతనం కట్ చేసుకుని ఇస్తున్నారన్నారు. 2వేల బీడీల వేతనం రూ.552 కూలిని కార్మికులు కోల్పోతున్నారన్నారు. బీడీ కంపెనీల యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కార్మిక శాఖ అధికారులు బీడీ కంపెనీల యాజమాన్యాలపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, బీడీ కార్మిక సంఘం నాయకులు సూరం పద్మ, జిందం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం..

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల, మే 28 (ఆంధ్రజ్యోతి): గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో సీపీఎన్‌డీటీ అడ్వయిజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ సీపీఎన్‌డీటీ యాక్ట్ నిబంధనల ప్రకారం నడపని స్కానింగ్ సెంటర్‌లను సీజ్ చేయడంతో పాటు రూ.50వేల జరిమానా, మూడు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. ప్రతి గర్భిణీ స్కానింగ్ వివరాలు పొందుపరుస్తూ రెండు సంవత్సరాల వరకు హార్డ్‌డిస్క్‌ల్లో నిల్వ ఉంచాలని అన్నారు. ఈ సందర్భంగా సీపీఎన్‌డీటీ టోల్ ఫ్రీ నంబర్ 9440054641ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అంజలి అల్ఫ్రెడ్, డాక్టర్ అనిత, డాక్టర్ రామకృష్ణ, మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు డాక్టర్ చింతోజు భాస్కర్, న్యాయ సలహాదారుడు శాంతిప్రకాష్‌శుక్లా, ఝాన్సీ శుక్లా, రాజ్‌కుమార్, బాలయ్య, మహేష్‌లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఆర్యవైశ్య ప్రతినిధులు

సిరిసిల్ల క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్ బి. గీతేను బుధవారం ఆర్యవైశ్య ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీని సత్కరించి శ్రీరాజరాజేశ్వరసామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బుస్స దశరథం, ప్రధానకార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, కోశాధికారి చీకోటి నాగరాజు, సిరిసిల్ల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కటకం సత్తయ్య, జిల్లా మాజీ అధ్యక్షుడు అల్లాడి శ్రీనివాస్, నగుబోతు రవీందర్, చేపూరి రవీందర్‌లు పాల్గొన్నారు.

కంచర్లలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్..

- ఇంటింటా చెత్త తొలగింపు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

వీర్నపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంతో పాటు పరిశుభ్రతపై వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాలతో బుధవారం స్పేషల్ డ్రైవ్ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో అబ్దుల్ వాజీద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటా తిరిగి చెత్తను తొలగించేశారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను విధిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆదేశించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలను లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మురుగు కాలువల వెంబడి బ్లీచింగ్ చల్లించారు. వీధుల వెంబడి దోమల మందు స్ప్రే చేయించారు. పంచాయతీ కార్యదర్శులు వెన్నెల, రణధీర్, సాయికృష్ణ లతో మూడు బృందాలను ఏర్పాటు చేసి పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం రూతమ్మ, ఆయా గ్రామాల కారోబార్లు, మల్టీపర్పస్ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రసానిక ఎరువుల వాడకం తగ్గించాలి

కోనరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయ సాగులో రసాయనిక ఎరువులు తగ్గించాలని రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో వేములవాడ వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె మధురమోహన్ రెడ్డి అన్నారు. కోనర్రావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించి ఈ సందర్భంగా మాట్లాడారు. రసాయనిక ఎరువులు తగ్గించి భూమాతను కాపాడుకోవాలని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రశీదులను భద్రపరుచుకోవాలని అన్నారు. పంట మార్పిడి చేసి వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులు వస్తాయని అన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారం అవుతామని అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, స్రవంతి, సహజ, పద్మ, రమేష్, కిషన్‌రెడ్డి, రాంప్రసాద్, నర్సయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారిగా రాజు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 28 (అంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారిగా కామారెడ్డి డీఈవోకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ విద్యాశాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారిగా కొనసాగుతున్న కరీంనగర్ జిల్లా విద్యాధికారి జనర్ధాన్‌రావును కరీంనగర్ కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో సిరిసిల్ల జిల్లా విద్యాధికారిగా కామారెడ్డి డీఈవో ఎస్ రాజుకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 28 (అంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుది దశకు కొనుగోళ్లు చేరుకోవడంతో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలల్లో ఇప్పటి వరకు 133 కేంద్రాలను మూసివేశామని పేర్కొన్నారు. జిల్లాలో యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా మొత్తం 242 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 37వేల 223 మంది రైతుల నుంచి రూ 578 కోట్ల విలువైన 2,49,372 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. వీటిలో 2,16,258 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆన్‌లైన్ చేశామన్నారు. 34,479మంది రైతుల ఖాతాల్లో రూ 447 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. మిగతా రైతుల ఖాతాల్లో త్వరలోనే డబ్బులు జమ అవుతాయన్నారు. ధాన్యం సేకరణ తుది దశకు చేరుకుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 133 కేంద్రాలను మూసివేశామని వివరించారు. రైతులు పండించిన ధాన్యం చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని రైతులు అధైరపడవద్దని కలెక్టర్ కోరారు.

గుండెపోటుతో లారీ క్లీనర్ మృతి

కరీంనగర్ క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అంబడిపూడి ఏడుకొండలు(50) అనే లారీ క్లీనర్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. కరీంనగర్ త్రీటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుజిల్లా బల్లపర్ల మండలం వెల్లటూరుకు చెందిన ఏడుకొండలు కొంతకాలంగా లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 26న లారీలో వినుకొండ నుంచి కర్రలోడ్ కోసం మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు వెళ్లాడు. చంద్రాపూర్‌లో కర్ర లోడ్‌తో తిరిగి వస్తుండగా మంగళవారం మధ్యాహ్నం కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద ఛాతిలో నొప్పివస్తున్నదని చెప్పిన ఏడుకొండలు లారీలోనే కుప్పకూలాడు. లారీ డ్రైవర్ వెంటనే ఏడుకొండలును 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఏడుకొండలు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

జగిత్యాలరూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల పవిత్ర (31) అనే వివాహిత చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మమత కొన్ని రోజులుగా అనారోగ్యతో బాధపడుతోంది. ఈ క్రమంలోనే ఈనెల 23న ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం బంధువులు జగిత్యాల లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి భర్త రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

రాయికల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన సిరిపురం శ్రీహరి (47) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సిరిపురం అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్ రావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


సమ్మయ్య(ఫైల్)

ముత్తారం, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన కోట సమ్మయ్య అనే వ్యక్తి అదృశ్యం కాగా ఆయన కుమారుడు కోటా అజయ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడని ఎస్సై భూపతి నరేష్ తెలిపారు. ఈనెల 26న ఇంట్లో భార్యాభర్తలకు గొడవ జరగగా గౌడవృత్తి చేసుకునే సమ్మయ్య తాటి చెట్టు ఎక్కివస్తానని సామాను తీసు కొని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. రెండు రోజులుగా వెతుకగా మంథని బస్టాండ్‌లో భూపాలపల్లి వైపువెళ్లే బస్సు ఎక్కుతున్నట్లు సమా చారం అందిందని బాధితుడి కుమారుడు అజయ్ ఫిర్యాదులో పేర్కొ న్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సారంగాపూర్, మే, 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సారంగాపూర్ ఎస్సై దత్తాద్రి తెలిపారు. జగిత్యాల మండలం తారకరామ్ నగర్‌కు చెందిన షేక్ రఫీక్(25) అనే వ్యక్తి ఆదిలాబాద్ జిల్లా కంబూడ గ్రామానికి చెందిన మార్వతి కాక వద్ద 1035 గ్రాముల గంజాయిని కొనుగోలు చేశాడన్నారు. అనంతరం జగిత్యాల తరలిస్తుండగా సారంగాపూర్ మండలం పోతారం చౌరస్త వద్ద పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి గంజాయి, ద్విచక్రవాహనం, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై దత్తాద్రి పేర్కొన్నారు.

ఊడిన చిల్డ్రన్స్ అవేర్‌నెస్ పార్క్ గేటు



తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఊడిన చిల్డ్రన్స్ అవేర్‌నెస్ పార్క్ గేటు

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోని రోడ్డు సెఫ్టీ చిల్డ్రన్ అవేర్‌నెస్ పార్క్ గేటు ఈ మధ్యలో వచ్చిన గాలి దూమారానికి ఊడిపోయింది. దాన్ని తిరిగి బిగిం చేందుకు అధికారులు అలసత్వం వహిస్తున్నారని కార్యాలయానికి వచ్చే వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు గేటును నాణ్యత ప్రమాణాలతో ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు.

ఎన్‌ఎఫ్‌బీఎస్ వితంతువులకు భరోసా

కుటుంబ పెద్ద మరణిస్తే రూ.20వేల ఆర్థిక సహాయం



చొప్పదండి, మే 28 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పెద్ద మరణిస్తే 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు ఉద్దేశించిన ఎన్ ఎఫ్‌బీఎస్ పథకం మళ్లీ ప్రారంభమయింది. ప్రమాదవశాత్తు లేదా ఏదైనా అనారోగ్య కారణాలతో ఇంటి పెద్ద మరణిస్తే 20వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం జాతీయకుటుంబ ప్రయోజన పథకం (ఎన్‌ఎఫ్‌బీఎస్)ను ప్రవేశపెట్టింది. వితంతువులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూపొందించిన ఈ పథకం కోవిడ్ సంక్షోభ సమయంలో నిలిచిపోయింది.

ఇటీవల ఈ పథకం తిరిగి ప్రారంభం కాగా అర్హుల నుంచి రెవెన్యూ, ఐకేపీ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వితంతువుల జాబితాను విచారణ జరిపి అర్హులను ఎంపిక చేసేందుకు అధికారులు కసరత్తును ప్రారంభించారు. కాగా అర్హులు దారిద్ర్యరేఖకు దిగువ కుటుంబానికి చెంది ఉండాలి. కుటుంబ పెద్ద మరణించిన రెండేళ్లలోపు వారు అర్హులు. వితంతువులు తమ దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాల్లో సమర్పించాలి.

దరఖాస్తుతో వితంతువు ఆధార్ కార్డు, కుటుంబ సభ్యులు ఆధార్ కార్డు, భర్త మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు ఫొటో, ఐకేపీ అధికారి నుంచి ఎన్‌వోసీ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్‌ను జతచేసి దరఖాస్తును అందజేయాలి. 59ఏళ్లకు పైబడిన వితంతువులు ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలు, దళితబంధు, రైతుబీమా, గీత కార్మిక నష్టపరిహారం అందుకున్న కుటుంబాలు, బాధిత కుటుంబాల పథకం నుంచి లబ్ధిపొందిన కుటుంబాలు ఈ పథకానికి అనర్హులు.

కళ్లలో కనపడుతున్నావు పెద్దనాన్న..

● నువ్వు వస్తావని ఎదురు చూస్తున్నా

● మావోయిస్టు నేత తిరుపతి తమ్ముడి కూతురు బహిరంగ లేఖ


తిరుపతి(ఫైల్)

కోరుట్ల, మే 28 (ఆంధ్ర జ్యోతి): "కళ్లలో కనపడుతున్నావు పెద్దనాన్న... ఇంకా నువ్వు వస్తావని ఇంటి గుమ్మం వద్ద కుటుంబసభ్యులం ఎదురు చూస్తున్నాం... ఎక్కడ ఉన్నా లొంగిపోవాలి.. నువ్వు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నా.." అంటూ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి తమ్ముడి కూతురు సుమ బహిరంగ లేఖ విడుదల చేసింది. ఆపరేషన్ కగార్‌తో వస్తున్న వార్తలను చూసి నీ కోసం కుటుంబం అంతా ఆందోళన చెందుతోందని లేఖలో పేర్కొంది.

కోరుట్ల పట్టణానికి చెందిన తిపిరి గంగమ్మ- వెంకటనర్సయ్య దంపతులకు ఒక కూతురు లీల, ముగ్గురు కుమారులు వెంకటి, తిరుపతి, గంగాధర్ ఉన్నారు. వీరిలో తిరుపతి 18 ఏళ్ల వయసులోనే 1984లో నక్సలింజం వైపు ఆకర్షితుడై అజ్ఞాతంలోకి వెళ్లాడు. అప్పటినుంచి మావోయిస్టు అగ్రనేతగా ఎదిగి అజ్ఞాతంలో ఉంటున్నాడు. అతని అన్న వెంకటి ప్రమాదవశాత్తు మృతిచెందగా తమ్ముడు తిప్పిరి గంగాధర్ కోరుట్లలో నివాసం ఉంటున్నాడు. గంగాధర్ కూతురు సుమ పెదనాన్న కోసం లేఖ రాసింది. నిన్ను చూడాలని ఉందని, ఉద్యమం వదిలి ఇంటికి రావాలని లేఖలో మావోయిస్టు నేత తిరుపతిని సుమ కోరింది.

ఆటో చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


దొంగను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలోని కోర్టు ఆవరణలో నిలిపి ఉన్న ఆటోను దొంగతనం చేసిన జిలకర ప్రసాద్‌ను అనేవ్యక్తిని జగిత్యాలటౌన్ పోలీసులు బుధవారం అరెస్టుచేశారు. టౌన్‌సీఐ వేణుగోపాల్ బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం నిర్మల్‌జిల్లా దుస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామానికిచెందిన మగ్గిడి కృష్ణ అనే వ్యక్తి ఈనెల 26న జగిత్యాల జిల్లా కేంద్రంలోని కోర్టుఆవరణలో తనఆటోను పార్కింగ్ చేశాడు. కోర్టు సమీపంలో తన పనులు ముగించుకుని తిరిగి వచ్చేసరికి ఆటో కనబడకపోవడంతో పట్టణపోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయంజిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ప్రాంత్రంలో పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీచేస్తున్న సమయంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన జిలకర ప్రసాద్ ఆటోను అతివేగంగా నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో జిలకర ప్రసాద్‌ను ఆటో దొంగగా గుర్తించి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై గీత తదితరులు ఉన్నారు.

పుస్తెల తాడు చోరీ

సుల్తానాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కన మామిడి పండ్లు అమ్ముకుంటున్న మహిళవద్దకు వచ్చిన ఇద్దరు అగంతకులు ఒకరు పండ్లు బేరమాడు తుండగా మరోవ్యక్తి మహిళ మెడలోని పుస్తెల తాడును లాక్కోని పారిపోయిన ఘటన బుధవారం వెలుగుచూసింది. మండలంలోని నీరుకుళ్ల గ్రామానికిచెందిన రమ్య నీరుకుళ్ళ శివారులోని మామిడితోటవద్ద మామిడిపండ్లు విక్రయిస్తోంది. బుధవారం ఇద్దరు బైక్‌పైవచ్చి ఒకరేమో పండ్లు బేరమాడుతుండగా మరొకరు అదునుచూసి మహిళమెడలోని పుస్తెల తాడు లాక్కోని బైక్‌పై పారిపోయారు. బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడిపై దాడి

ఇల్లందకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య గొడవ పరస్పర దాడికి దారి తీసింది. పోలీసులు, ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు అన్వేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు మూడ్రోజులుగా హుజూరాబాద్ లీడర్స్ వాట్సాప్‌గ్రూప్‌లో ఇల్లందకుంట ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు అన్వేష్ ఇదే మండలానికి చెందిన సామల రాజిరెడ్డి పరస్పరం చాటింగ్ చేసుకున్నారు. కాంగ్రెస్‌పార్టీలో మేము సీనియర్స్ అంటూ.. మేము లేకుంటే కాంగ్రెస్‌పార్టీ లేదంటూ చాటింగ్ చేసుకున్నారు. ఇద్దరిది ఇల్లందకుంట మండలం కావడంతో బుధవారం చూసుకుందామని సాయంత్రం రాజిరెడ్డి అన్వేష్‌కు ఫోన్‌చేయగా అక్కడికి చేరుకున్న అన్వేష్‌పై రాజిరెడ్డితో పాటు మరోఇద్దరు దాడిచేశారు. దీంతో అన్వేష్‌కు గాయాలు కాగా జమ్మికుంట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. పోలీసులను వివరణ కోరగా ఇద్దరు ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

భక్తులపై తేనెటీగల దాడి

మల్లాపూర్, మే, 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లివెంకట్రావ్‌పేట శివారులోని లింగాలరేవు వద్దకు బుధవారం మొక్కులు తీర్చుకొనేందుకు వచ్చిన పలువురు భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి ప్రతి బుధవారం, శుక్రవారం అధికసంఖ్యలో వస్తుంటారు. బుధవారంభక్తులు మొక్కులు చెల్లిస్తుండగా తేనెటీగలు దాడి చేయడంతో పలువురికిస్వల్ప గాయాలయ్యాయి.

గోదావరిఖనిలో క్షుద్రపూజల కలకలం

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిబీకాలనీ రాజీవ్‌రహదారి సర్వీస్ రోడ్డు పైగల మైసమ్మగుడి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేశారనే ప్రచారంపై స్థానికులు ఆందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం స్థానికులు దీనిని గమనించారు. ఇద్దరి ఫొటోలతో నిమ్మకాయలు, జీడిగింజలు, ఇతర సామగ్రి పెట్టి క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. సమీపంలోని సీసీకెమెరాలను పరిశీలించగా ఒకవ్యక్తి బైక్‌పై వచ్చి అక్కడపెట్టినట్లు గుర్తించారు. బైక్‌నెంబర్ ఆధారంగా మంచిర్యాలజిల్లాకు చెందిన అతడిగా గుర్తించారు.

ట్రైనీ ఎస్సైకి నోటీసులు

హుజూరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయకమిషన్ నోటీసులు జారీ చేసిందని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జీ టి సంపత్ అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15రోజుల క్రితం మండలంలో ట్రైనీ ఎస్‌ఐ భార్గవ్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మహేందర్ అనే వ్యక్తిని రెండుచెవుల కర్ణబేరిలు పగిలిపోయేలా కొట్టాడన్నారు. దీనిపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర జాతీయ ఎస్సీకమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై స్పందించిన మానవ హక్కుల కమిషనర్ కరీంనగర్ సీపీ, అడిషనల్ లాఅండ్‌ఆర్డర్‌కు నోటీసులు జారీచేసిందన్నారు. ప్రజలకు పోలీసులపై విశ్వాసం ఉండాలంటే, నిజానిజాలు తెలవాలంటే ఎస్‌ఐ భార్గవ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రవితేజ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

● బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్‌నేత

పెద్దపల్లి కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్‌నేత అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్య నాహక్కు. బాలకార్మిక వ్యవస్థను అంతంచేద్దాం అనే నినాదంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. దేశం అభివృద్ధి చెందాలంటే నేటిబాలలే భావిభారత పౌరులుగా తయారు కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలకార్మిక వ్యవస్థ రూపుమాపేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. బాలలకు స్వేచ్ఛగా ఉండే వాతావరణాన్ని కల్పించాలని, ప్రతీ చిన్న విషయంలో పిల్లలను మందలించవద్దన్నారు. బాలలు బడిలో ఉండాలని పనిలో ఉంటే నేరమన్నారు. బాలకార్మికులచే పని చేయించుకుంటే కఠినమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాలన్నారు. బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా మనమంతా కృషిచేద్దామని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తల్లిదండ్రులు ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. భావితరం బాలలప్రగతికోసం పునాదులు వేద్దామన్నారు. బాలకార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

విత్తనాల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు


నుస్తులాపూర్‌లోని మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తిమ్మాపూర్, మే 28 (ఆంధ్ర జ్యోతి): నుస్తులాపూర్‌లోని పలు విత్తన, ఎరువు, పురుగు మందుల దుకాణాల్లో తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్, ఎల్‌ఎండీ ఎస్సై వివేక్, ట్రైనీఎస్సై శ్రీకాంత్‌తో కలిసి మండల వ్యవసాయధికారి సురేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా అధీకృతడీలర్ వద్ద మాత్రమే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. రసీదులు తప్పక తీసుకొని పంటకాలం వరకు వాటిని భద్రపరుచుకోవాలని సూచించారు.

పారిశుధ్య కార్మికుడికి పాముకాటు

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుడు చంద్రగిరి భూమయ్య (55) బుధవారం పాముకాటుకు గురయ్యాడు. గోదావరిఖని గాంధీనగర్‌లోని ప్రధాన నాలాలో పూడిక పేరుకుపోయి చెట్లు పొదలు పెరగడంతో పారిశుధ్య కార్మికుడు చంద్రయ్య వాటిని తొలగించేందుకు డ్రైన్‌లోకి దిగాడు. పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా పాము చేయిపై కాటు వేసింది. అతడిని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు.

మృతదేహాలు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధం

● మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

● పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ డిమాండ్


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

పెద్దపల్లిటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధమని పౌరహక్కుల సంఘం, ప్రజాఫ్రంట్ నాయకులు పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ జిల్లాకేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద పౌరహక్కుల సంఘం ఉమ్మడికరీంనగర్ జిల్లా కమిటీఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల21న నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాల అప్పగింతపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం అక్కడిపోలీస్‌వర్గాలు కుటుంబ సభ్యులకు మృతదేహాలనుఇవ్వలేదని, నాలుగు రోజులు ఇబ్బందులకు గురిచేస్తూచివరకు పోలీసులే దహన సంస్కారాలు చేశారన్నారు. కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులుమావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు, సహచరుల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. మావోయిస్టుపార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాలకేశవరావు, సహచర సభ్యుల బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జీచే న్యాయ విచారణ జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో కేంద్రప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని డిమాండ్‌చేశారు.

పౌరహక్కుల సంఘం రాష్ట్రసహాయ కార్యదర్శి మాధన కుమార స్వామి, ఉమ్మడి కరీంనగర్‌జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బొంకురిలక్ష్మణ్, బొడ్డుపల్లి రవి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడి కొమురయ్య, పులిపాక రవీందర్, విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, దళిత లిబరేషన్‌ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్వాడీ సుదర్శన్, అశోక్, మోదుంపల్లి శ్రవణ్, ఆంజనేయ శర్మ, సుచరిత, పర్వతాలు, సత్యనారాయణ, బండి శంకర్ పాల్గొన్నారు.

జనావాసాల మధ్య పేలుళ్లు

● ఆందోళన చెందుతున్న స్థానికులు


ఇళ్లకు సమీపంలో ఓ బావి వద్ద చేపడుతున్న పూడికతీత పనులు

గన్నేరువరం, మే 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న వేళ రైతులు వ్యవసాయబావుల్లో పూడికతీత పనులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో మండలకేంద్రంలోని ఎస్సీ, బీసీ, పద్మశాలికాలనీ నుంచి వ్యవసాయక్షేత్రాలకు వెళ్లేమార్గంలో ఉన్న బావుల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయి. బావి అడుగున బండరాళ్లు అడ్డురావడంతో పేలుడు పదార్థాలైన జిలిటెన్ స్టిక్స్‌లను వినియోగిస్తున్నారు. వీటివినియోగంపై స్థానికులకు సమాచారం ఇవ్వకపోవడంతో పేలుడు శబ్దాలతో వారంతా భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ సమీపంలోనే పేలుళ్లు జరిగాయి. ఎలాంటి అనుమతులు, సమాచారం లేకుండా పేలుళ్లు జరపడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పేలుడు పదార్థాలు వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ పేలుళ్లు జరగడం గమనార్హం.

హోటల్‌ను సీజ్ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్


జగిత్యాలలో హోటల్‌ను సీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

జగిత్యాల అర్బన్, మే 28 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల శివసాయి హోటల్‌ను బుధవారం జగిత్యాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష సీజ్ చేశారు. హోటల్‌లో టిఫిన్ తిని కొద్దిరోజుల వ్యవధిలోనే ఫుడ్ పాయిజన్ అయి పలువురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో బుధవారం జగిత్యాల ఫుడ్ఇన్‌స్పెక్టర్ హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం హోటల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. మేడిపల్లి మండలానికి చెందిన ఓవ్యక్తి తన కుమారుడితో కలిసి ఈ నెల 21న ఇదే హోటల్‌లో టిఫిన్‌చేయగా వాంతులు అయ్యాయి. జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు బాధితుడు తెలిపాడు. ఈ నెల 22న మేడిపల్లి మండలం కాసారం గ్రామానికి చెందిన ఓ గర్భిణి ఇక్కడ టిఫిన్ చేయగా తీవ్ర అస్వస్థతకు గురైనట్లు ఆమెసోదరుడు తెలిపారు. మంగళ వారం బుగ్గారం మండల కేంద్రానికి చెందిన బిసవేని వినోద్ గౌడ్‌తోపాటు అతడి అక్కపిల్లలు, తల్లి తీవ్రఅస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. సంపాదనే ధ్యేయంగా వినియోగదారుల ప్రాణాలను లెక్కచేయ కుండా వ్యాపారాలు చేస్తున్న టిఫిన్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వినోద్ జిల్లాఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశాడు.

భవనంపై హోర్డింగ్ బిగిస్తుండగా ప్రమాదం

● హెచ్‌టీ లైన్ తగిలి కార్మికుడికి తీవ్రగాయాలు


గాయపడిన తిరుపతి

కోల్‌సిటీ, మే 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మార్కండేయకాలనీ జంక్షన్ వద్ద భవనంపై అడ్వర్టయిజ్‌మెంట్ హోర్డింగ్ బిగిస్తుండగా కార్మికుడికి ప్రమాదవశాత్తు 11కేవీ విద్యుత్ వైర్ తగిలింది. ఒక రెస్టారెంట్‌కు సంబంధించి డిజిటల్ బోర్డు బిగించేందుకు సామగ్రి భవనంపైకి ఎక్కిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన తిరుమల్(53) అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. అతనికి తీవ్ర గాయాలయ్యాయని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగానే ఉంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. మూడేళ్ల క్రితం ఇదే విధంగా హై టెన్షన్ లైన్ల కింద ఫ్లెక్సీ బిగిస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి ఒక కార్మికుడు మృతి చెందాడు. మళ్లీ ఇదే తరహా ప్రమాదం చోటు చేసుకుంది.

నేడు ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం...

హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గురువారం సమీక్షా సమావేశం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరుగనుంది. సమీక్షా సమావేశానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కార్ వేణుగోపాల్ రావులతోపాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, జిల్లా ఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొంటారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉదయం 9 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 9:50కి కరీంనగర్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

ఎస్సారార్ పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ అటనామస్ కళాశాల పీజీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్ కుమార్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాలలో 11 పీజీ కోర్సులు నిర్వహిస్తున్నట్లు, వాటి ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ పీజీ మొదటి సెమిస్టర్‌లో 261 మంది విద్యార్థులకు 226 మంది(87శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పీజీ మూడో సెమిస్టర్‌లో 242 మందికి 222 (92 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు, వెబ్‌సైట్లో ఫలితాలను పొందుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ, శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు కరుణాకర్, డాక్టర్ మల్లారెడి, అకాడమిక్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్..



జగిత్యాల గోదాంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు



వెల్గటూర్ ఎమ్మార్సీలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

- మండల పాయింట్లకు సరఫరా షురూ
- జూన్ 12లోగా పాఠశాలలకు పంపిణీకి చర్యలు

వెల్గటూర్, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసేందుకు పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బడులు తెరిచే నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాంలు అందిం చేలా విద్యా శాఖ కసరత్తు చేస్తోంది. పాఠ్యపుస్తకాలు జిల్లాకు, అక్కడి నుంచి మండల పాయింట్లకు చేరు కుంటు న్నాయి. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో అప్పటి వరకు అన్ని తరగతు లకు సంబంధించిన పుస్తకాలు అందించేలా చర్యలు చేపడుతామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

విడుదల కాని రవాణా చార్జీలు

జగిత్యాల జిల్లాలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 85,368 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాకు 3,80,760 పుస్తకాలు అవసరం కాగా ఇప్పటి వరకు 3,52,000 పుస్తకాలు గోదాంకు చేరుకున్నాయి. ఇంకా 28,760 పుస్తకాలు రావాల్సి ఉంది. గతంలో ఉన్నత తరగతులకు నోట్ బుక్స్ పంపిణీ చేయగా, ప్రభుత్వం ఈసారి ప్రాథమిక తరగతులకు సైతం నోట్ బుక్స్ పంపిణీ చేయాలని నిర్ణయించింది. జిల్లా కేంద్రంలో భద్రపర్చిన పుస్తకాలను ప్రస్తుతం ఆయా మండలాల ఎమ్మార్సీలకు పంపిణీ చేస్తున్నారు. అక్కడి నుంచి ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా స్కూల్ పాయింట్లకు చేరవేస్తున్నారు. కాగా పాఠ్య పుస్తకాల ట్రాన్స్‌పోర్ట్‌కు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని అధికారులు చెబుతున్నారు. ఎంఈవోలు ఈ చార్జీలు భరిస్తున్నట్లుగా తెలుస్తోంది. నిధులు వచ్చిన తర్వాత వారికి బిల్లులు అందించనున్నట్లు సమాచారం.

పంపిణీకి సిద్ధంగా బైలింగ్వల్ పార్టు-1 పుస్తకాలు

ప్రస్తుతం పాఠశాలల పునః ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చేర్పించాలనే ధోరణి ఏర్పడడంతో ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యపుస్తకాల్లో (బై లింగ్వల్) ఒక పేజీలో తెలుగు, మరొక పేజీలో ఇంగ్లీష్‌లో పాఠాలను ముద్రించారు. ఈ క్రమంలో పాఠ్య పుస్తకాలను పార్టు-1, పార్టు-2 గా విభజించి విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రస్తుతం పార్టు-1 పుస్తకాలు జిల్లాకు చేరుకోగా, పార్టు-2 పుస్తకాలు సెప్టెంబర్ వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని విభజించడం ద్వారా విద్యార్థులకు పుస్తకాల బరువు కూడా తగ్గింది.

పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించాం

ద్రోణం రాజు వెంకట రామకృష్ణ, పాఠ్య పుస్తకాల జిల్లా మేనేజర్, జగిత్యాల



జిల్లా గోదాం నుంచి మండల పాయింట్లకు పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభించాం. జిల్లాకు 92 శాతం పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఇప్పటికే 16 మండలాలకు పుస్తకాలు పంపిణీ చేశాం. బడిబాట కార్యక్రమానికి ముందుగానే పుస్తకాలు చేరవేసే విధంగా చర్యలు చేపడుతున్నాం.

డిగ్రీ పరీక్షల్లో 34 మంది డీబార్

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాల్‌ప్రాక్టీస్ చేసిన 34 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. నాలుగో సెమిస్టర్‌లో తొమ్మిది మంది, ఆరో సెమిస్టర్ 25 మంది డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాల కేంద్రంలో 13 మంది, శివాని నలుగురు, అపూర్వలో ఇద్దరు, ఎస్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఒకరు, జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, చాణిక్య డిగ్రీ కళాశాలలో ఒకరు, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నలుగురు, సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకరు, శ్రీ శివానిలో ఒకరు, మెట్‌పల్లి జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో ఒకరు, గోదావరిఖని ప్రభుత్వం డిగ్రీ కళా శాలలో ఒకరు, పెద్దపల్లి ట్రినిటీ డిగ్రీ కళాశాల ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఒకరు, కోరుట్ల ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఒకరు, జగిత్యాల ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు ఉన్నట్లు వివరించారు.

రాజన్న ఆలయం మూసివేత వదంతులు నమ్మొద్దు

వేములవాడ కల్చరల్ మే 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని జూన్ 15వ తేదీ నుంచి మూసి వేస్తున్న ట్లు ఆలయ ఈవో పేరుతో ఓ తప్పుడు లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నదని, అలాంటి వదంతులను ప్రజలు నమ్మవద్దని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయంలో ఆలయాన్ని మూసివేస్తున్నట్లుగా ఎలాంటి లేఖను విడుదల చేయలేదని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖకు రాజన్న ఆలయానికి ఎలాంటి సంబంధం లేదని, ఆలయంలో దర్శనాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



మాట్లాడుతున్న నర్సింగోజు శ్రీనివాస్

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచే విషయంలో ప్రభుత్వం ఇంతవరకు క్లారిటీ ఇవ్వలేదన్నారు. ఒక్కోసారి ఒక్కో రకమైన ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకసారి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతున్నట్లు ప్రకటిస్తున్నారని, మరోసారి పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామంటున్నారని అన్నారు. పార్టీ పరంగా ఇస్తే అన్యాయం జరుగుతుందని, రిజర్వేషన్లు పెంచుతూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.

12 నెల క్రితం నిర్వహించాల్సిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్లతో వాయిదా పడుతున్నాయన్నారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల విషయం పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. పరిష్కారం కాకుండా ఎన్నికలకు వెళ్లడం న్యాయం కాదని, ప్రతిపక్ష పార్టీలు బీసీ రిజర్వేషన్లు విషయంలో తమ వైఖరి ప్రకటించాలని కోరారు. బీసీ రిజ ర్వేషన్లు 20 శాతం నుంచి 42 శాతం అసెంబ్లీలో చట్టం చేశారని, దాని ప్రకారం ఇంత వరకు ప్రభుత్వం జీవో జారీ కాలేదని అన్నారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, కేంద్రంపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి లింగం పల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అబద్ధాల పునాదులపై మోదీ పాలన

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



సీపీఐ మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, మే 28(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అబద్ధాల పునాదులపై పాలన సాగిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ మహాసభల సందర్భంగా ప్రతి నిధుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో సమస్యలను గాలికి వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఉద్యోగ, ఉపాధి, తిండి వంటి ఎన్నో కష్టాలను పేదలు అనుభవిస్తున్నార్నారు. దేశంలో ఆదాయం రెట్టింపు అయ్యిందని అబద్ధాలు చెబుతూ దేశాన్ని అప్పుల పాలు చేశారన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేస్తున్నారన్నారు.


సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బలహీన వర్గాలపై ముప్పేట చేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అమలు కావడం లేదన్నారు. అర్హులకు ఇవ్వకుండా ఇష్టారీతిన నిబంధనలు పెట్టడం న్యాయం కాదన్నారు. స్థానిక ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలన్నారు. అంతకుముందు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన పార్టీ కార్య క్రమాల వివరాలను కార్యదర్శి నివేదికను సభలో ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మచ్చ రమేష్, కిన్నెర మల్లవ్వలు, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, పొనగంటి కేదారి, బోయిని అశోక్, కొయ్యడ సృజన్‌కుమార్, అందెస్వామి, బత్తుల బాబు, గూడెం లక్ష్మి పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్



సీపీఐ జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నగరంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 123వ మహాసభలు ముగింపు సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్‌లు హాజరయ్యారు. జిల్ల మహా సభలో నూతన కార్యవర్గం, కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించారు. 14 మంది కార్యవర్గం ఏర్పాటు కాగా, 35 మందితో కౌన్సిల్, ఐదుగురు క్యాండిడేట్ సభ్యులు, నలుగురు ఆహ్వానితులను ఎన్నుకున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వాట్సాప్ చాట్‌బాట్



టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా కూడా తమ సమస్యలను తెలుపవచ్చని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ మొబైల్ నుంచి వాట్సప్‌లో 7901628348 నంబర్‌కు హాయ్ అని చాట్ చేయగానే హాయ్ టీజీ ఎన్‌పీడీసీఎల్ కాల్ సెంటర్‌కు స్వాగతం అని వస్తుందన్నారు. అందులో రిజిస్టర్ కంప్లైంట్, ట్రాక్ కంప్లైంట్, చాట్ విత్ ఏజెంట్ అనే మెసేజ్ వస్తుందన్నారు. రిజిస్టర్ కంప్లయింట్‌పై క్లిక్ చేయగానే విత్ యూనిక్ సర్వీస్ నంబర్, వితవుట్ యూనిక్ సర్వీస్ నంబర్, ప్రీవియస్ మెనూ అని వస్తుందని తెలిపారు.

విత్ యూనిక్ సర్వీస్ నంబర్‌ను సెలక్ట్ చేసి నంబర్‌ను ఎంటర్ చేయగానే సర్వీస్ వివరాలు వస్తాయన్నారు. వివరాలను ఎంటర్ చేసి ఓకే చేయగానే కంప్లయింట్‌కు సంబంధించిన వివరాలు మెనూలో కనపడుతాయని తెలిపారు. అందులో కంప్లయింట్‌కు సంబంధించి సబ్ టైప్ లేదా చాట్ విత్ ఏజెంట్ అని వస్తుంది. తర్వాత ఏజెంట్‌తో చాట్ చేయవచ్చు లేదా కంప్లయింట్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కంప్లయింట్ ఐడీతో ఒక నంబర్ జెనరేట్ అయ్యి ఫిర్యాదు నమోదవుతుందని తెలిపారు. అనంతరం చర్యల కోసం సంబంధిత అధికారికి కంప్లయింట్ వెళుతుందని, ఈ విషయం వినియోగదారుడి మెసేజ్ వెళ్తుందని తెలిపారు. భవిష్యత్తులో కంప్లయింట్ ఐడీతో వినియోగదారుడి సమస్యను ట్రాక్ చేసుకోవచ్చని తెలిపారు. కంప్లయింట్ పూర్తైన తర్వాత వినియోగదారుడికి సమాచారంతోపాటు ఐవీఆర్ఎస్ ద్వారా కాల్ వెళ్తుందన్నారు.

సమస్య పరిష్కరించిన తర్వాత ఫీడ్ బ్యాక్ ఇవ్వమని అడుగుతుంది లేదా సంతృప్తి చెందకపోతే మళ్లీ కంప్లైంట్ రీఓపెన్ చేయమని అడుగుతుందని తెలిపారు. www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో వాట్సాప్ ఐకాన్ కనిపి స్తుందని, ఆ ఐకాన్ క్లిక్ చేసి చాట్ చేయ వచ్చని తెలిపారు. వినియోగదారుడికి ఉత్తమసేవలు అందించడంలో భాగంగా సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి వాట్సాప్ చాట్‌బాట్ ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందాలని సూచించారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పద్మకు అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

తంగళ్లపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పద్మ దర్శనాల రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. 2024-25 సంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారు. అందుకుగాను బుధవారం హైదరాబాదులోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్‌తో పాటు ఐదు లక్షల క్యాష్ అవార్డును కళాశాల ప్రిన్సిపాల్ పద్మ అందుకున్నారు. అలాగే కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో స్టేట్ రెండో ర్యాంకు సాధించిన నందినికి రూ10 వేల క్యాష్ అవార్డు అందజేశారు.

సమగ్ర విద్యకు ప్రభుత్వం కృషి

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర విద్యాకోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సంజీవయ్య సంక్షేమ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలు అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 268 ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ విద్యాసంస్థల ద్వారా దాదాపు 1.7 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించడం సామాజిక న్యాయ దిశగా ముందడుగన్నారు.

రాజన్న ఆలయ 13 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్ మే 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి హుండీ లెక్కింపును బుధవారం చేపట్టారు. ఆలయ 13 రోజుల హుండీని ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య లెక్కించగా కోటి 44లక్షల 25వేల 31 రూపాయల నగదు, 107 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 7 కిలోల 900 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. కార్యనిర్వహణాధికారి వినోద్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ పరిశీలకుడు సత్యనారాయణ, ఏఈవోలు ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుండీ కౌంటింగ్‌లో శ్రీశివరామకృష్ణ భజన మండలి వారు పాల్గొన్నారు.

మత్తడి దూకుతున్న చెక్‌డ్యాంలు

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



మత్తడి దూకుతున్న కొడిమ్యాల పెద్ద వాగు

కొడిమ్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు కొడిమ్యాల పెద్ద వాగు పారుతూ పూడూర్ గ్రామ శివారులోని ఐదు చెక్‌డ్యాంలు బుధవారం నుంచి మత్తడి దూకుతున్నాయి. దీంతో సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెక్‌డ్యాంల నీటితో ఈ రోహిణి కార్తీలో పత్తి, మొక్కజొన్న, కంది, పెసళ్ల, పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకోవటానికి అనుకూలంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. పూడూర్ గ్రామ శివారులో అకాల వర్షం నీటితో నిండిన చెక్‌డ్యాంలను బుధవారం సిరిసిల్లలోని వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సందర్శించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, రాజన్నపేట గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు.కార్యక్రమంలో నాయకులు పద్మారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, బాలపోచయ్య, దేవరాజు, శంకర్, బాపురెడ్డి, సురేందర్, దేవయ్య, రాజేందర్‌రెడ్డి, నర్సింలు, రాజమల్లు పాల్గొన్నారు.

● వీర్నపల్లి, మే28, (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో అంకమల్ల భూదవ్వకు మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాకేష్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, రణధీర్, బాబు, శంకర్, నాగరాజు, తిరుమలేష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో జాప్యంపై ధర్నా



నిమ్మపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ధర్నా చేస్తున్న వెంకట్రావుపేట రైతులు

కోనరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామ రైతులు ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడం లేదని నిరసిస్తూ నిమ్మపల్లి ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అకాల వర్షాలు పడడం వల్ల ధాన్యం మొలకెత్తుతున్నాయని అన్నారు. రైస్ మిల్లర్లు సన్న వడ్లు కొనడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేసి సన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి పూర్తి చేయాలని కోరారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్, దుమాల, అక్కపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట తదితర గ్రామాల్లో అధికారులు బుధవారం పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామాల్లోని మురుగునీటి కాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇళ్ల పరిసరాలను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీర సావర్కర్ జయంతి

ఇల్లంతకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్కానిపేటలో బుధవారం వీర సావర్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, సీనియర్ నాయకులు ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, పినకాసి అనీల్, పొనవేని రాజు, తిప్పారపు భాస్కర్, పున్నం కనుకయ్య, సామ వెంకటరెడ్డి, సామ చొక్కారెడ్డి, కీర్తి మల్లేశం, ఓరుగంటి నర్సయ్య, బొంగోని మల్లేశం, సిరవేని నర్సయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో స్థానిక నాయకులు, లబ్ధిదారులతో కలిసి బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య భూమిపూజ చేశారు. నాయకులు లక్ష్మారెడ్డి, బాబు, రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, బుచ్చాగౌడ్, తిరుపతిగౌడ్, రాజ్‌కుమార్, రాజేశ్, రాములు, లక్ష్మణ్, పోచయ్య, ఎల్లయ్య, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి మే 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లకు బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి భూమి పూజ చేసారు. కార్యక్రమంలో ఎంపీడీవో నటరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, తర్రె మనోహర్, ఎర్రం గంగానరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, సూర యాదయ్య, దయ్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

● కోనరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం ధర్మారం, కనగర్తి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, సాయిప్రియ ముగ్గుపోసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వెంగలి వెంకన్న, బాబు రెడ్డి తదితరులు ఉన్నారు.

ధూప దీప నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం

బోయినపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) జిల్లా దూప దీప నైవేద్య అర్చకుల ఆత్మీయ సమ్మేళనం మండలంలోని కొత్తపేట యాదరామయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. సమావేశంలో అధ్యక్షుడు పార్థసారధిశర్మ మాట్లాడుతూ దూపదీప నైవేద్య అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు కొండమాచార్యులు, జిల్లా ప్రధానకార్యదర్శి పరంకుశం రమేష్, అర్చకులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

చందుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి అంబేద్కర్ సంఘం నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారంను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేసినందున ప్రధాన మంత్రి మోదీకి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, నాయకులు కూసుంబ లింగారవు, బోరుగాయ కమలాకర్. పడమటి మల్లేశం, పసుల రవి, కూసుంబ మధు, కూసుంబ రామారత్నం, పసుల రవీందర్, దావీదు, స్వామి, గసికంటి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును రాజకీయం చేస్తున్నారు

కోనరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలును కొంతమంది వ్యక్తులు అనవసరంగా రాజకీయం చేస్తున్నారని, దీనిని రైతులు అర్థం చేసుకోవాలని కోనరావుపేట సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కోనరావుపేట మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సుమారు 90శాతం పూర్తి చేశామని అన్నారు. వెంకట్రావుపేటలో 90శాతం పూర్తి చేశామని, కొంత మేరకే ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, అది రేపు పూర్తిచేస్తామని అన్నారు. ఈ సంవత్సరం రోహిణి కార్తీ రాక ముందే వర్షాలు పడటంతో కొంత ఇబ్బంది జరిగింది అని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గతంలో కన్నా ఇప్పుడు ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేశామని అన్నారు. గతంలో కంటే ఇప్పుడు తొందరగా కొనుగోలు చేశామని, ఇది రైతులు గమనించాలని అన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



మహేష్‌చంద్రను సన్మానిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట, మే 28 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో పనిజేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వుడుత మహేష్‌చంద్ర రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రాక్టీస్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. అత్యుత్తమ బోధనా పద్ధతులు, వినూత్న వ్యూహాలతో మనబడి కార్యక్రమం చేపట్టడంతో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆచరించిన విధానాలను వివరించారు. దీనితో మహేష్‌చంద్రను ఉత్తమ ప్రాక్టీస్ ఉపాధ్యాయుడిగా ప్రకటించారు. గతంలో పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో సైన్స్ విభాగంలో ప్రతిభ కనబర్చడంలో మహేష్‌చంద్ర కీలక పాత్ర పోషించారు. పాఠశాల పూర్వవిద్యార్థులు సహకారంతో మనబడి కార్యక్రమం క్రింద రూ 10లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. మహేష్‌చంద్రను జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ప్రధానోపాధ్యాయిణి ప్రేమలత, రిసోర్స్‌పర్సన్స్ తిరుపతిరెడ్డి, యాద రవి, భాస్కర్‌రెడ్డి, దూస సంతోష్, కిషన్ లతో పాటు ఉపాధ్యాయులు సన్మానించారు.

అప్రమత్తంగా ఉంటే చాలు..

(5వ పేజీ తరువాయి)

చితికిపోగా, అనేక కుటుంబాల్లో మృత్యుఘోష వినిపించింది. మూడో దశలో ఎలాంటి ఇబ్బంది లేకుండానే గడిచిపోయింది. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. గతంలో రెండు దశల్లో జిల్లాలో 37,197 మంది.. కొవిడ్ బారిన పడ్డారు. 676 మంది మృతిచెందారు. జిల్లాలో కొవిడ్ రెండు దశలతో పాటు ఒమ్మైక్రాన్ సీజన్ వరకు 7,19,092 మందికి కొవిడ్ పరీక్షలు చేయగా, 37,197 మంది కొవిడ్ బారిన పడ్డారు. వీరిలో 36,509 మంది కోలుకున్నారు. 676 మంది మృత్యువాత పడ్డారు. ఇందులో మొదటి వేవ్‌లో 13,380 మంది కొవిడ్ బారిన పడగా, 165 మంది మృతిచెందారు. సెకండ్ వేవ్‌లో 19,085 మంది కొవిడ్ బారిన పడగా, 508 మంది మృతిచెందారు. థర్డ్ వేవ్‌లో 4,732 కొవిడ్ బారిన పడ్డారు. 2020 సంవత్సరంలో ఏప్రిల్‌లో 2.91 శాతం, మేలో 27.91 శాతం, జూన్‌లో 2.61 శాతం, జూలైలో 15.33 శాతం, ఆగస్టులో 27.10 శాతం, సెప్టెంబరులో 28.48 శాతం, అక్టోబరులో 7.88 శాతం, నవంబరులో 4.13 శాతం, డిసెంబరులో 1.63 శాతం నమోదైంది. 2021 సంవత్సరంలో జనవరిలో 1.35 శాతం, ఫిబ్రవరలో 0.96 శాతం, మార్చిలో 1.90 శాతం, ఏప్రిల్‌లో 20.04 శాతం, మేలో 30.9 శాతం, జూన్‌లో 1.91 శాతం, జూలైలో 1.22 శాతం, ఆగస్టులో 0.73 శాతం, సెప్టెంబరులో 0.32 శాతం అక్టోబరులో 0.60 శాతం, నవంబరులో 0.10 శాతం డిసెంబరులో పూర్తిగా కేసులు తగ్గుముఖం పట్టి 0.05 శాతానికి చేరుకుంది. 2022 జనవరిలో థర్డ్‌వేవ్ వచ్చింది. జనవరిలో 9.96 శాతం కేసులు నమోదు కాగా ఫిబ్రవరిలో 3.69, మార్చి 0.05 శాతం, ఏప్రిల్, మేలో నిల్, జూన్‌లో 0.05 శాతం, జూలైలో 12.20 శాతం. ఆగస్టులో 1.02 శాతం, సెప్టెంబరులో 0.72, అక్టోబరు, నవంబరు, డిసెంబరు 2023 జనవరి, ఫిబ్రవరిలో పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. మార్చి 10.71 శాతం పాజిటివ్ రేటు చేరుకుంది. ఏప్రిల్‌లో తగ్గుముఖం పట్టింది. ఈసారి కూడా భయపడాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు.

ఎలాంటి పరిస్థితులకైనా సిద్ధంగా ఉన్నాం...

- డాక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్



జిల్లాలో ప్రస్తుతం కొవిడ్ వైరస్ లక్షణాలు లేవు. జిల్లా ఆసుపత్రిలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. ఏ వైరస్ అయినా చేతుల ద్వారానే శరీరంలోకి ప్రవేశిస్తున్నందున ప్రజలు కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. శుభ్రంగా లేని చేతులతో కళ్లు, ముక్కు తాకడం వంటివి చేయవద్దు. మాస్క్ ధరించడం, వ్యక్తిగత పరిశుభ్రత, రద్దీ ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఏవైరస్ వచ్చినా నియంత్రణలో పెట్టవచ్చు. ప్రజలు ఆందోళన చెందకుండా ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందవచ్చు.

30 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - రెండో విడత ఇళ్ల మంజూరు ఉత్తర్వులు పంపిణీ



ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు 30 రోజులలోగా తప్పనిసరిగా ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లబ్ధిదారులకు సూచించారు.బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బోయిన్‌పల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్‌లో రెండో విడత కింద 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ బోయిన్‌పల్లి మండలం అనంతపల్లి గ్రామంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసుకొని మొదటి విడత కింద 109 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, 50 శాతంవరకు పూర్తయ్యాయని, ప్రభుత్వం వారికి చెల్లింపులు కూడా చేస్తుందన్నారు. రెండో విడత కింద మండల వ్యాప్తంగా 709 లబ్దిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని, వీరు ఇంటి నిర్మాణం పనులు 30రోజులలోగా తప్పనిసరిగా ప్రారంభించాలన్నారు. 3 నెలల వ్యవధిలో ఇళ్ల నిర్మాణం పనులు పూర్తిచేసుకొని రానున్న పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థికసహాయం అందుతుందన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ బోయిన్‌పల్లి మండలంలో 709 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల హృదయాల్లో స్పష్టమైన ముద్ర వేసుకునేలా సిరిసిల్ల కలెక్టర్ పనితీరు ఉందని ఎమ్మెల్యే ప్రశంసించారు. మానవీయ కోణంతో పని చేస్తున్న కలెక్టర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మిడ్ మానేరు బాధితులకు న్యాయం చేయడం కోసం త్వరలో అదనంగా 1000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. మండలంలో 4153 రైతులకు రూ36 కోట్ల 63 లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని, గతంలో కేవలం 13కోట్ల మాత్రమే జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, పిఏసి చైర్ పర్సన్ వెంకట రామారావు, సెజ్ సంచాలకులు సుధాకర్, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి వినోద్, ఎంపీడీవో జయశీల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సురేందర్ రెడ్డి రమణారెడ్డి సుధాకర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటారు ప్రారంభం

గంభీరావుపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం ముచ్చర్ల హీరాలాల్ తండాలో బుధవారం బోరు మోటార్‌ను ప్రారంభించారు. ముచ్చర్ల హీరాలాల్ తండాలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.2 లక్షల అంచనాలతో బోరు, మోటారు మంజూరైంది. బోరు మోటరు మంజూరుకు కృషి చేసిన సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, కాంగ్రెస్ గ్రామశాఖఅధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, నాయకులు బంగ్ల రాజుగౌడ్, మెతుకు నర్సింలు, పాతూరి రమేష్, అంజునాయర్, శ్రీరాం ఉన్నారు.

బియ్యం వితరణ

తంగళ్లపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన తంగళ్ళపల్లి మండలం కస్బెకట్కూర్ గ్రామంలో శనిగరం దిలీప్ కుటుంబాన్ని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి సత్తు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. అలాగే 50 కిలోల బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి సత్తు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జూపల్లి రాజేశ్వర్ రావు, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, కిషన్‌లు ఉన్నారు.

కార్మికులకు పనులు కల్పించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణలల్లో స్థానిక సుతారీ మేస్త్రీలతోపాటు భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏవోతో పాటు జిల్లా కార్మిక శాఖ అధికారులను సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణలల్లో స్థానికులకు పనులు కల్పించాలంటూ వినతి పత్రాలను అందించారు. ఈసందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో కాంట్రాక్టర్‌లు ఇతర ప్రాంతాల కార్మికులను పనుల్లో పెట్టుకుని నిర్మాణాలు చేపట్టడంతో స్థానికులకు ఉపాధి లేకుండా పోతోందన్నారు. జిల్లా కార్యదర్శి కోడం రమణ, భవన నిర్మాణ సంఘం పట్టణ అధ్యక్షుడు కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మొలక.. కర్షకుల కలత..

ఎల్లారెడ్డిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులు, నిర్వాహకుల నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారుతోంది. కేంద్రాలకు తరలించి 45 రోజులు గడుస్తున్నా ధాన్యం తూకం వేయకపోవడం, వేసిన ధాన్యం తరలించేందుకు లారీలు రాక తిప్పలు తప్పడంలేదు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం మొలకెత్తింది. దీంతో రైతులు కలత చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు తడిసిన ధాన్యం బస్తాలను తరలించాలని రైతులు కోరుతున్నారు.



తిమ్మాపూర్‌లో తడిసిన ధాన్యం బస్తాలు

ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన కల్పించాలి

- బీజేపీ రాష్ట్ర ప్రభారి అవినాష్ దావాజీ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపట్టాలనుకునే ఒకే దేశం, ఒకే ఎన్నికపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర ప్రభారి అవినాస్ దావాజీ కోరారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అధ్యక్షతన జిల్లా ప్రవాస్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అవినాష్ దావాజీ, మల్లికారావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో ప్రజల్లోకి చేరే విధంగా ప్రణాళిక బద్ధంగా ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, కోకన్వీనర్ సంతోష్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు, కన్వీనర్లు, కోకన్వీనర్లు పాల్గొన్నారు.

సీఎం ఫొటోలు ఉండాలని జీవో జారీ చేయండి..



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

సిరిసిల్ల టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫొటోలు ఉండాలని జీవోను తీసి అమలుచేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సవాలు విసిరారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలు ఓట్లు వేస్తే గెలిచిన పార్లమెంట్, అసెంబ్లీ సభ్యులు చట్టాలను, ప్రొటోకాల్స్‌ను ఏర్పాటు చేస్తారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో కేటీఆర్, ఆది శ్రీనివాస్ గెలిచారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కువగా గెలిచినందున కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆది శ్రీనివాస్ విప్‌గా నియమించిందన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో విప్‌గా ఆది శ్రీనివాస్ ఎన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నాడు ఆ కార్యక్రమాలకు ఎన్నిసార్లు సిరిసిల్ల శాసన సభ్యుడు కేటీఆర్‌ను ఆహ్వానించారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ పాటించకుండా కేటీఆర్ ఫొటో లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కేటీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను మీరు చేసినట్లు కేటీఆర్ ఫొటోలు లేకుండా ప్రొటోకాల్ పాటించకుండా ప్రారంభిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, ఎంఐఎం ఎమ్మెలేల క్యాంప్ ఆఫీసుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోలు పెట్టుకున్నారా అని ప్రశ్నించారు. ఎంపీగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ క్యాంప్ కార్యాలయాల్లో ప్రధాన మంత్రి ఫొటోలు పెట్టుకున్నారా అని ప్రశ్నించారు.

సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు గుండారపు కృష్ణారెడ్డి, గెంట్యాల శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్, రాజిరెడ్డి, ఉమారెడ్డి పాల్గొన్నారు.

పాలిస్టర్ వస్త్రానికి కూలి పెంచేలా చర్యలు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లలో పాలిస్టర్ వస్త్రానికి కూలి పెంచే విధంగా పాలిస్టర్ యాజమానులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కలెక్టర్‌తో పాటు కార్మిక శాఖ అధికారులు పాలిస్టర్ యాజమానులతో చర్చలు జరిపి కూలి పెంచాలని లేకుంటే రానున్న రోజుల్లో అవసరమైతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పూర్తి సహకారం

సిరిసిల్ల కలెక్టరేట్ మే 28 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిసహకారం అందిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పురోగతి తదితర అంశాలపై ఆయా మండల ప్రత్యేక అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా రాష్ట్రంలో జిల్లా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో ప్రథమ స్థానంలో నిలవడంలో కృషిచేసిన అధికారులందరికీ కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇదే విధంగా ఇండ్ల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వివిధ దశల్లో మొత్తం పది ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంటుందని తెలిపారు. దానికి సంబంధించి ఆయాగ్రామాల కార్యదర్శులు, పట్టణాల్లో వార్డుఆఫీసర్లు తమ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మహిళా సంఘాలకు ఇటుక బట్టీలు, సెంట్రింగ్ దుకాణాలు ఏర్పాటుచేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మోడల్ హౌస్‌ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ మోడల్‌హౌస్‌లను ఇందిరమ్మ లబ్ధిదారులకు చూపించాలని పేర్కొన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల జారీలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మంజూరైన 7862 ఇళ్లకు 7808 అలాట్మెంట్ ఆర్డర్లు లబ్ధిదారులకు అందజేసినట్లు వెల్లడించారు.

ప్రొటోకాల్‌పై ప్రశ్నిస్తే దాడులు

తంగళ్లపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ కోసం ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడుతున్నారని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో లేకుండా అధికారిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, కాంగ్రెస్ నేతలు ప్రత్యక్ష దాడులు చేస్తామని బహిరంగంగా బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. మాజీ ఎంపీపీ పడిగెల మానస, నాయకులు వలకొండ వేణుగోపాల్‌రావు, పడిగెల రాజు, ఉమ్మారెడ్డి సత్యనారాయణ రెడ్డి, జక్కుల నాగరాజు యాదవ్, నందగిరి భాస్కర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడాన్ని ఓర్వలేక విమర్శలు

సిరిసిల్ల టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడాన్ని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ఆరోపించారు. బుధవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనునిత్యం పార్టీతో ఉంటూ జడ్పీటీసీగా, ఎంపీటీసీగా, ఎంపీపీగా గెలిచి ఆది శ్రీనివాస్ ప్రజల మధ్యన ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17నెలలో దాదాపు రూ.1000కోట్ల నిధులను తీసుకొచ్చిన ఘనత విప్ ఆది శ్రీనివాస్‌కే దక్కిందన్నారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రతి ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫొటోలు పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీని విమర్శించేస్థాయి ఆగయ్యకు లేదన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలను విమర్శిస్తే ఊరుకోబోమని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు కుడిక్యాల రవికుమార్, వేముల రవి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్‌ర నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వైద్య శివప్రసాద్, నక్క నర్సయ్య, బొప్ప దేవయ్య పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుపై కాంగ్రెస్ సంబరాలు

చందుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గానికి 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు పట్ల చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేస్తూ, టపాసులు పేర్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమం, విద్యకు మొదటి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు ఎన్గంటి శంకర్, రవిందర్‌రెడ్డి, ప్రభాకర్, శంకరయ్య, చంద్రం, ఏసుదాసు, గణేష్, దేవస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కేటాయించి స్కూల్ నిర్మాణానికి 200కోట్లు మంజూరు చేసిన సందర్భంగా వేములవాడ రూరల్ కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. బుధవారం పార్టీ కార్యాలయం ఆవరణలో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేసారు. అనంతరం స్కూల్ మంజూరీకి కృషి చేసిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాలకూర్తి పర్శరాములు, నాయకులు నేదూరి రమేశ్, రేమాల ప్రవీణ్, గోవర్ధన్‌రెడ్డి, ఆదిల్ పాషా, బత్తిని ఎల్లాగౌడ్, సోయినేని కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి మే 28 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసమే వేములవాడకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు కావడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో తర్రె మనోహర్, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, జక్కు మోహన్, జక్కు వంశీ, జక్కుల లక్ష్మీనారాయణ, పిడుగు లచ్చిరెడ్డి, పల్లి గంగాధర్, సిరికొండ రవి, సూర యాదయ్య, గంధం మనోజ్, దయ్యాల శ్రీనివాస్, ధ్యవల దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు